క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మల నరికివేత పనులు జరుగుతున్నందున అన్నోజిగూడ ఫీడర్ నుంచి కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నోజిగూడ, ఎల్ఎన్ కాలనీ, సాయినగర్, ఎన్టీపీసీ రోడ్, మసీద్ గల్లీ, ఎల్ఐజీ, జైపురి కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

మేడ్చల్ సీఐ బదిలీ

ఘట్‌కేసర్: మేడ్చల్ సీఐ రాజశేఖర్ ఆదివారం బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనర్ ఆయనను గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. మేడ్చల్ సీఐగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

శాకంబరుడిగా ఎల్లంపేట్ శివుడు



మేడ్చల్: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో పార్వతీ సమేత రాజరాజేశ్వర ఆలయంలో మరకత లింగ శివుడిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శివుడిని పలు రకాల కూరగాయాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై దర్శించుకున్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎదులాబాద్‌కు చెందిన కాసోజ్ సాయికుమార్ కుటుంబానికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామంలోని మృతుడి నివాసానికి ఆదివారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ తరపున మృతుడి తల్లి నీరజకు రూ.10 వేల చెక్కును అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సత్యం, ఆల్వా వీరారెడ్డి, దేవేందర్, శరబంద పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం కూల్చివేయించారు. ఘట్‌కేసర్‌లోని సర్వే నంబర్–117లో అక్రమంగా నిర్మించిన 8 ఇళ్లను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చెరువులు, కాల్వలు, కుంటలను ఆక్రమించి ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా శంకర్‌ముదిరాజ్



నియామక పత్రం అందుకుంటున్న శంకర్ ముదిరాజ్

మేడ్చల్: మేడ్చల్ పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా కిందిబస్తీకి చెందిన శంకర్‌ముదిరాజ్ నియమితులయ్యారు. శంకర్‌ను జిల్లా ఓబీసీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవి ముదిరాజ్ నియమిస్తూ ఉత్తర్వుల జారీ చేసి అందజేశారు. సీనియర్ నాయకుడైన శంకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఓబీసీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

ఉద్యాన హబ్.. ఇంకెన్నాళ్లు..!

నగర శివారుల్లో వరికి బదులు ఉద్యాన పంట సాగు పెంచాలని నిర్ణయం

- జిల్లా పర్యటనలో భాగంగా హబ్‌పై హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్
- సీఎంఓ ఆదేశాలతో రూ.250 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. విడుదల కాని నిధులు
- భర్తీ చేయని ఖాళీ పోస్టులు.. జాడలేని కొత్త పోస్టులు
- సాగునకు నోచుకోని 30 వేల ఎకరాల్లో అదనపు ఉద్యాన పంట
- నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరుతున్న రైతులు





సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారులో వ్యవసాయ పంట సాగును హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి నిధుల కొరత అడ్డంకిగా మారింది. ప్రతిఏటా 10 వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంట సాగును పెంచడం ద్వారా మూడేళ్ల వ్యవధిలో ప్రస్తుతం సాగవుతున్న ఉద్యాన పంటతో పాటు అదనంగా 30 వేల ఎకరాలకు పెంచాలన్న జిల్లా ఉద్యానవన శాఖ లక్ష్యం నేరవేరడం లేదు. సీఎం హామీ ఇచ్చి దాదాపు మూడేళ్లు కావొస్తున్నా.. పట్టుమని 5 వేల ఎకరాల్లో కూడా అదనంగా ఉద్యాన పంట సాగు కాలేదు. సంబంధిత శాఖలో కూడా ప్రతిపాదిత అదనపు సిబ్బంది పోస్టులు మంజూరుకు నోచుకోలేదు. ఉద్యాన శాఖలో ఖాళీ ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు.

◆ సీఎం హామీ ఇచ్చి..

2020 అక్టోబర్ 29న నగర శివారు మూడుచింతలపల్లి మండల కేంద్రంలో ధరణి పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ శివారు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాను ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో 2020 నవంబర్‌లో ఉద్యాన శాఖ జిల్లాను ఉద్యాన హబ్‌ను అభివృద్ధి చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది.

◆ ఉద్యాన హబ్‌పై ప్రతిపాదనలివే..

నగర శివారును ఉద్యాన హబ్‌గా అభివృద్ధి పరిచేందుకు ప్రాజెక్టు నిర్వహణ కింద మూడేళ్ల వ్యవధిలో రూ.250 కోట్ల అంచనా వ్యవయంతో జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. శివారుల్లోని 99 వేల ఎకరాల వ్యవసాయ(పంట సాగు) భూమి ఉండగా, ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యానవన పంట సాగు చేస్తున్నారని, మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నట్లు ప్రతిపాదనల్లో వివరించిన యంత్రాంగం 2024 సంవత్సరం వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యాన(హార్టికల్చర్) పంట సాగు చేయవచ్చునని పేర్కొంది. ప్రతి ఏటా 10 వేల ఎకరాల చొప్పున దశలవారీగా మూడేళ్లలో 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంట సాగు పెంచేందుకు అవకాశముందని, ఇందు కోసం హార్టికల్చర్ శాఖలో ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బంది సంఖ్యకు అదనంగా ఏడుగురు హార్టికల్చర్ అధికారులు, 10 మంది హెచ్ఈఓ పోస్టులు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో యంత్రాంగం పేర్కొంది.

◆ దాదాపు మూడేళ్లు కావొస్తున్నా..

నగర శివారు ఉద్యాన హబ్ అభివృద్ధిపై ప్రభుత్వానికి జిల్లా ఉద్యాన శాఖ నివేదిక సమర్పించి దాదాపు మూడేళ్లు కావొస్తున్నా.. మోక్షం లభించకపోవడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు అలుముకున్నాయి. దీంతో గడిచిన రెండేళ్లలో కూడా అదనంగా 5 వేల ఎకరాల్లో కూడా ఉద్యాన పంట సాగు పెంచలేదు. జిల్లా హార్టికల్చర్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు. అదనపు పోస్టుల మంజూరీ ఊసే లేదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలోనైనా ప్రభుత్వం నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు తక్షణమే నిధుల విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

జవహర్‌నగర్‌ను ఉత్తమ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతా..

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



జవహర్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో రూ.8.10 కోట్లతో నిర్మించే ప్రగతి పనులను ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, ఐటీ, పరిశ్రమ, వ్యవసాయ రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, యూజీడీ, వీధి దీపాలు వంటి పనులు నిరంతరం కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలోనే జవహర్‌నగర్‌ను ఉత్తమ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. మంత్రి కేటీఆర్ కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి అత్యధికంగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. 7వ డివిజన్ కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి ఆధ్వర్యంలో గుర్రాల స్వారీతో క్రేన్ సహాయంతో భారీ గజమాలతో మంత్రి మల్లారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు ఏకే.మురుగేష్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, మెట్టు ఆశాకుమారి, మేక లలితయాదవ్, సతీష్‌కుమార్, పానుగంటి బాబు, గొడుగు వేణు, శాంతికోటేష్‌గౌడ్, యువరాజ్, సుబ్రమణ్యం, శివాజీ, బల్లి రోజాశ్రీనివాస్, నిహారికగౌడ్, నాగరాజివెంకటేష్‌గౌడ్, లావణ్యసతీష్‌గౌడ్, పల్లపు రవి, కో–ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు మెట్టు వెంకన్న, సింగన్న బాలరాజు, చందర్, సుధాకర్‌చారి, వెంకటేష్, కృష్ణయాదవ్, సవితాగౌడ్, వసంత, శ్రీలత, రజిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

గౌడవెల్లి గ్రామంలో పర్యటన..

శామీర్‌పేట్: మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామంలో ఆదివారం మంత్రి చామకూర మల్లారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సొంత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలోని పల్లె నుంచి పట్టణం వరకు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సుతారిగూడలోని బోనాల పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ శైలజ, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సుతారిగూడలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి

నవంబర్ 2నుంచి కీసరలో బొడ్రాయి పున:ప్రతిష్ఠ కార్యక్రమాలు



కీసర: మండల కేంద్రమైన కీసరలో నవంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు బొడ్రాయి పున:ప్రతిష్ఠ (బొడ్రాయి పండగ) కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదివారం కీసర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామపెద్దలు నిర్ణయించారు. ఉత్సవాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని సమావేశంలో చర్చించారు. వైస్ఎంపీపీ జె.సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గుప్తా, జంగయ్యయాదవ్, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, వివిధ పార్టీల నేతలు, వివిధ కులసంఘాల నేతలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢమాసం రెండో ఆదివారం సందర్భంగా అమ్మవారు శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయాలతో అమ్మవారిని వేదపండితులు సుందరంగా అలంకరించారు. ప్రజల ఆకలి కష్టాలను తీర్చాలని అమ్మవారికి ఈ అలంకరణ చేసినట్లు వేద పండితులు తెలిపారు. ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న అరుణ్ కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ దేశంలోని సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేశారని అరుణ్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పట్టణంలో ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ఉదయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, రాములు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, సత్యం, ఆంజనేయులు, నరేశ్, శోభన్ బాబు, సిచిన్, విష్ణు, నారాయణ, శశి, ప్రవీణ్‌కుమార్, ఉపేందర్, సంతోశ్‌కుమార్, చందు, అనుశ్, జీవన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని శివసాయి ఎన్‌క్లేవ్‌లో సుమారు రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అల్వాల్: నందికంటి శ్రావణ్‌కుమార్ ఫౌండేషన్, ముత్తుట్ ఎం జార్జ్ ఫౌండేషన్ సంస్థ సౌజన్యంతో ఆదివారం వెంకటాపురం డివిజన్ కానాజీగూడ నల్లపోచమ్మ గుడి వద్ద ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ, గుండె, షుగర్, బీపీ, లివర్ పరీక్షలు నిర్వహించారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ ఆశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణగౌడ్, సంజీవ్‌కుమార్, నిరంజన్, శివశంకర్, సాయికుమార్, ప్రభాకర్, నందకుమార్, సందీప్, సత్య, ప్రవీణ్, బాల్‌పీర్, ఆశ, సంతోష్, మధు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



కీసర సీఐని కలిసిన నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



కీసర: కీసర సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎ.వెంకటయ్యను ఆదివారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కీసర పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, కీసర సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ కీసర పోలీస్‌స్టేషన్‌లో సీఐకి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. సీఐ వెంకటయ్య మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, పోలీసులకు సహకరించాలన్నారు. కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



శ్రీరంగవరంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ చేపట్టిన మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని శ్రీరంగవరం వివిధ గ్రామాల పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. తొమ్మిదేళ్లలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రచారం చేసిన ప్రతి ఇంటికీ కమలం స్టిక్కర్‌ను అంటించి వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ నాయకుడు మండల ఇన్‌చార్జి శంకర్‌జీ, మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, మాజీ సర్పంచ్ పోచయ్య, నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఘట్‌కేసర్: ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎదులాబాద్‌లోని డీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులను కలుసుకొని ఆనంద సంద్రంలో మునిగి తేలారు. తమ క్షేమ సమాచారాలు, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పించి జీవితానికి బంగారు బాట వేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.



బీఆర్ఎస్‌కు ఇద్దరు నేతల రాజీనామా



రాజీనామా లేఖ ప్రదర్శిస్తున్న మధు, రాజు

ఘట్‌కేసర్: అధికార బీఆర్ఎస్‌కు మున్సిపాలిటీలో షాక్ మీద షాక్ తగులుతోంది. ఎస్సీ సెల్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు కడుపోల్ల మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ తోక రాజు బీఆర్ఎస్, పార్టీ సభ్యత్వానికి ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులుపై మంత్రి మల్లారెడ్డి గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం, నియోజకవర్గంలో ఎస్సీ దళిత, సామాజిక వర్గానికి ఒక్కరికి కూడా మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవి కేటాయించకపోవడంతో రాజీనామా చేశామన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



ఎన్ఎఫ్‌సీనగర్‌లో వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ బస్తీ దవాఖానా ఆవరణలో వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. మూడో వార్డు కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 512 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా మాట్లాడుతూ వైద్యశిబిరానికి హాజరైన వారు వైద్యం కోసం ఆస్పత్రిలో చేరితే 50 శాతం రాయితీతో వైద్యం అందిస్తామన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, నరసింహారెడ్డి, వైద్యులు శ్రీకాంత్, శశాంక్, వైద్యసిబ్బంది భరత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసమే జీవితం



బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ప్రజా సంక్షేమం, పార్టీలో ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకు తన జీవితాంతం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తల బాధలు తనకు తెలుసని, ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజాసంక్షేమ పథకాలు పార్టీ కార్యకర్తలు బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల అండదండలు, పార్టీ శ్రేణుల సహకారంతో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ కట్టబెట్టి మరోసారి ఉప్పల్ గడ్డపై పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.